క్లుప్తంగా

ఆవిర్భావ వేడుకను ఘనంగా నిర్వహించాలి

మండపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 7న ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు దూలి జయరాజు కోరారు. మండపేటలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ, బడుగు బలహీన వర్గాల వారి సంక్షేమమే లక్ష్యంగా మందా కృష్ణమాదిగ ఎమ్మార్పీఎస్‌ను నెలకొల్పి 30 ఏళ్లు కావస్తోందన్నారు. ఈ సందర్భంగా మాదిగ సామాజిక వర్గీయులు వాడవాడలా దండోరా జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జయరాజు కోరారు.

రూరల్ సీఐగా శ్రీధర్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్సీ తోటను కలిసిన సీఐ శ్రీధర్‌కుమార్

మండపేట: మండపేట రూరల్ సీఐగా కె. శ్రీధర్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడియం సీఐగా పనిచేస్తూ బదిలీపై ఆయన మండపేట వచ్చారు. ఇక్కడ పనిచేసిన పి. శివగణేష్ వీఆర్‌లోకి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సీఐ శ్రీధర్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

రామచంద్రపురం: ఈనెల 9వ తేదీన విజయవాడ గాంధీనగర్ ఫిలిం చాంబర్‌లో జరిగే ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వీఆర్వోల సంఘం గౌరవాధ్యక్షుడు మద్దాల బాపూజీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభలో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. రెవెన్యూ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ సభలో నిర్ణయాలు తీసుకుంటారన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కె.గంగవరం: బాలాంత్రం గ్రామానికి చెందిన కటకం వీరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో బుధవారం జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరుపున నిత్యావసర సరకులు అందజేశారు. ప్రతి గ్రామంలో చారిటబుల్ ట్రస్ట్ తరుపున పేద వారికి సహాయం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ట్రస్ట్ వ్యవస్థాపకులు పోలిశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. నాయకులు చిర్రా రాజ్‌కుమార్ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

రామచంద్రపురం రూరల్: ఉండూరులో మంగళవారం ఎస్ఈబీ అధికారులతో కలసి చేసిన దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. అదే గ్రామానికి చెందిన మిడిసిపాటి వెంకట్రావు, మిడిసిపాటి వీరప్రకాశ్, గుడాల శ్రీనివాస్‌లను అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.950 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: మండలంలో ఖాళీగా ఉన్న 8 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి బుధవారం తెలిపారు. రాయవరం, కుర్మాపురంలో రెండేసి, కురకాళ్లపల్లి, మాచవరం, వెదురుపాక, సోమేశ్వరం గ్రామాల్లో ఒక్కొక్క వలంటీర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గురువారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నూరు శాతం బయోమెట్రిక్ అథంటికేషన్ చేయాలి

రాయవరం: పాఠశాలల్లో విద్యాకానుక తీసుకున్న విద్యార్థుల బయోమెట్రిక్ అథంటికేషన్ శత శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి హెచ్ఎంలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన హెచ్ఎంతో సమీక్ష జరిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ మధ్యాహ్న భోజనాన్ని తీసుకునేలా బాధ్యత వహించాలన్నారు. ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణలు మాట్లాడుతూ టెన్త్ ఫెయిలైన ప్రతి విద్యార్థి తిరిగి అదే పాఠశాలలో పదో తరగతిలో చేరేలా చూడాలన్నారు.

9న బస్సుయాత్ర

రామచంద్రపురం: ఈనెల 9న జరిగే బస్సుయాత్రను జయప్రదం చేయాలని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గొల్లపాలెం నుంచి బస్సుయాత్ర మొదలవుతుందని వెంకటాయపాలెం రోడ్‌లోని ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశంలో పార్టీ నేతలు, నాయకులు పాల్గొనాలన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత



శివల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణు

మండపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి సూచించారు. పట్టణంలోని సూర్యచంద్ర ఫిషర్‌మెన్ కమ్యూనిటీ హాలు, టౌన్ హాలు వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దుర్గారాణి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్, విప్ పోతంశెట్టి ప్రసాద్, జంగమ, షేక్ కార్పొరేషన్ల డైరెక్టర్లు మీగడ శ్రీనివాసరావు, ఆలీఖాన్‌బాబా, కౌన్సిలర్లు ఎర్నేని ప్రభావతి, బొక్కా సరస్వతి, ఏఎంసీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏడిదలో..

మండలంలోని ఏడిదలో గ్రామ సచివాలయం -2 వద్ద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీఓ ఐ.రాజు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వైఎస్సార్‌సీపీ నేత కుడిపూడి రాంబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ నాగబాబులు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు తాతపూడి ఉష, ఈఓ వుండమట్ల వీర్రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కె.గంగవరం: జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ భరోసా వస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. శివల గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకులు లేరని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య లక్ష్యసాధన, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేని విధంగా గడపగడపకూ అధికారులను తీసుకువెళ్లి తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని రూపొందించారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందించారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్ అనుసూరి సాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మండల వ్యవసాయ సహాయ కమిటీ చైర్మన్ ఇళ్లా సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, మండల మాజీ కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ఆధారంగా పథకాల అమలు

కపిలేశ్వరపురం: అంగర-2 సచివాలయ పరిధిలో బుధవారం సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, ఎంఎల్ఓ జగన్, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ళ రాంబాబు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, సచివాలయాల మండల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసంశెట్టి వాసు, కార్యదర్శులు కామేశ్వరరావు, మహ్మద్ ఆలీ, వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పథకాలతోనే పేదల జీవన ప్రమాణాల మెరుగు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- తిప్పరాజుపాలెం 'గడప గడపకూ'



తిప్పరాజుపాలెంలో ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం తిప్పరాజుపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి వేణు గోపాలకృష్ణ వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. ప్రభుత్వ పథకాలను వివరించి, వారు పొందిన లబ్ధిని లబ్ధిదారులకు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గతంలో ఎన్నడూ లేనంత విధంగా ఈ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. సమస్యలన్నీ గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మంత్రి వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్, ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, మండల వైఎస్సార్‌సీపీ బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, పార్టీ నాయకులు టేకుమూడి దుర్గారావు, యాళ్ల సత్తిబాబు, మాజీ సర్పంచ్ యాళ్ల శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మేలు చేస్తున్న జగన్‌ను ఆశీర్వదించండి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెదురుపాకలో గడప గడపకూ..



వెదురుపాకలో ఎమ్మెల్సీ త్రిమూరులుకు ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు

రాయవరం: నేను మీకు మంచి చేస్తున్నాను.. మీకు మేలు జరిగితే నన్ను ఆశీర్వదించండి అంటూ ధైర్యంగా చెప్పగలిగిన ఏకైక ముఖ్యమంత్రి దేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వెదురుపాకలో ఎమ్మెల్సీ బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు మండ వెంకటపద్మావతి, వాసంశెట్టి రామలక్ష్మి సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులకు గ్రామస్తులు అడుగడుగునా హారతులు పట్టి, పూలుజల్లుతూ స్వాగతించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్లు తాడి బులివెంకటరెడ్డి, టేకుమూడి రాంబాబు, సొసైటీ మాజీ చైర్మన్ సత్తి వీరవెంకట, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- వెల్లలో జగనన్న అమ్మఒడి కార్యక్రమం



వెల్లలో లబ్ధిదారులకు అమ్మఒడి నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న అమ్మఒడి కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ చిన్నారి కూడా పేదరికం కారణంగా చదువులకు దూరం కాకూడదనే ధ్యేయంతో సీఎం జగన్ పని చేస్తున్నారన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చి పేదల ఉన్నత చదువులకు బాటలు వేస్తే, జగనన్న మన రాష్ట్రంలోని చిన్నారులు విద్యలో ఉన్నతంగా రాణించాలని అమ్మఒడి, నాడు-నేడు పథకాల ద్వారా విద్యా విప్లవం తెచ్చారన్నారు. చంద్రబాబు హయాంలో పాఠశాలలను నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. అనంతరం అమ్మఒడి లబ్ధిదారులైన రామచంద్రపురం రూరల్, రామచంద్రపురం అర్బన్‌లలోని 8,544 మంది తల్లులకు రూ.12,81,60,000 నమూనా చెక్కును మంత్రి వేణు మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ తాతపూడి ప్రసన్న విజయకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు తదితరులతో కలసి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంతగడ విజయప్రసాద్, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ మల్లిడి సాయిలక్ష్మి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



పామర్రు పీహెచ్‌సీలో రోగుల నుంచి సమాచారం సేకరిస్తున్న డీఎం అండ్ హెచ్ఓ దుర్గారావు

కె.గంగవరం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి దుర్గారావు దొర వైద్యులకు సూచించారు. మండల పరిధిలోని పామర్రు పీహెచ్‌సీ, పలు సబ్ సెంటర్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పీహెచ్‌సీలలో మందులతో పాటు సిబ్బందిని, వైద్యులను అందుబాటులో ఉంచిందని సిబ్బంది చిత్తశుద్ధితో పని చేసి ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం ఆసుపత్రి రికార్డులు పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో జరిగే ఆరోగ్యకార్యక్రమాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కోటిపల్లి వద్ద గల పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను పరిశీలించి రికార్డులు చూసి సిబ్బంది సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు మాణిక్యం, పార్వతి, సూపర్‌వైజర్ మల్లికార్జునుడు, ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- చైర్‌పర్సన్ దుర్గారాణి సూచన
- 26వ వార్డులో పర్యటన



26వ వార్డు ప్రజలతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: వర్షాకాలం ప్రవేశించినందున అంటు వ్యాధులు ప్రబలకుండా పట్టణ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి సూచించారు. వార్డు పర్యటనల్లో భాగంగా బుధవారం కమిషనర్ టి.రామ్‌కుమార్, కౌన్సిలర్ అమలదాసు లక్ష్మితో కలిసి 26వ వార్డులో ఆమె పర్యటించారు. చెత్త సేకరణ, డ్రైన్లలో పూడికతీత గురించి స్థానికులతో మాట్లాడారు. వారి తెలిపిన సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ మెరుగైన పారిశుధ్య నిర్వహణ లక్ష్యంగా చేపట్టిన వార్డుల పర్యటన కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలం దృష్ట్యా ఎక్కడా పారిశుధ్య లేమి తలెత్తకుండా కృషిచేస్తున్నామని చైర్‌పర్సన్ దుర్గారాణి తెలిపారు. వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఆలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, నీలం దుర్గ, పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రక్షిత తాగునీరు



పసలపూడిలో వాటర్ ట్యాంకుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ప్రతి కుటుంబానికి తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు.ఈ పథకం కింద పసలపూడి గ్రామంలోని కోరి నాగయ్య వీధిలోవాటర్ ట్యాంక్‌కు ఎమ్మెల్సీ త్రిమూర్తులు బుధవారం భూమి పూజ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది 1.20 లక్షల లీటర్ల నీటిగి నిల్వ సామర్థ్యం గల ఈ వాటర్ ట్యాంకును రూ.1.15 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు.

మహిళల ఆవేదన విన్న ఎమ్మెల్సీ

పలువురు మహిళలు ఎమ్మెల్సీ త్రిమూర్తులను కలిసి మడత మంచాల గుడ్డల ఫ్యాక్టరీని మూసివేయించే కుట్ర జరుగుతోందని, దీని వలన తాము ఉపాధిని కోల్పోయి రోడ్డున పడనున్నట్లు తెలిపారు. సమస్యను విన్న త్రిమూర్తులు వెంటనే స్పందించి మడత మంచం గుడ్డల స్మాల్ స్కేల్ ఇండస్ట్రీని సందర్శించారు. అక్కడ నుంచే చేనేత జౌళి శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి, మహిళలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాధరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి(బాబులు) పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



బండారు విజయకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

కాజులూరు: గ్రామాల్లో పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు పలువురు దాతలు అందిస్తున్న సహకారాలు ఎన్నటికీ మరువలేనివని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. ఆ కళాశాల విద్యార్థిని బండారు విజయ ఈ ఏడాది సిల్వర్ సెట్ పరీక్షల్లో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించి దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఫ్రీ సీట్ సాధించారు. ఈ ఏడాది ఇంటర్మీడియెట్‌లో 937/1000 మార్కులతో మండల ప్రథమస్థానంలో నిలిచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ఆణిముత్యాలు పథకం ద్వారా రూ.15 వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. అలాగే కళాశాల లైబ్రేరీ సైన్సెస్ అధ్యాపకులు విళ్ల భీమేశ్వరావు, ఆయన మిత్రులైన ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వపు విద్యార్థులు రూ.25 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థిని విజయకు అందజేశారు. ఈ సందర్భంగా విజయ ఉన్నత విద్యకు ఆర్థిక సహకారానికి అందించిన దాతలను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

లెప్రసీ సర్వేను పారదర్శకంగా చేయాలి



లెప్రసీ సర్వేపై వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ భరతలక్ష్మి

రామచంద్రపురం రూరల్: లెప్రసీ సర్వేను అప్రమత్తంగా చేసి విజయవంతం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ భరతలక్ష్మి వైద్య సిబ్బందికి సూచించారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ, రామచంద్రపురం అర్బన్ పీహెచ్‌సీలను ఆమె బుధవారం సందర్శించారు. గత నెల 26వ తేదీన ప్రారంభమై ఈ నెల 16వ తేద వరకూ జరగనున్న లెప్రసీ సర్వే తీరును ఆమె పరిశీలించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న 17 లక్షల మందికి గాను 6,85,000 మందిని వైద్య సిబ్బంది పరీక్షించగా 12 కేసులు గుర్తించామన్నారు. వీటిలో రామచంద్రపురం డివిజన్ పరిధిలోని కుందూరు, పామర్రు, ద్రాక్షారామ పీహెచ్‌సీలతో పాటు రామచంద్రపురం అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో 4 కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎన్. ప్రశాంతి, డాక్టర్ సందీప్‌నాయుడు, డాక్టర్ అలేఖ్య, సీఎంఓ వీరవేణి, డీపీఎంఓ వెంకట్బేర్లు, నోడల్ పర్సన్ గంగాధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలపై సమీక్ష

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం, మండపేట అర్బన్ పీహెచ్‌సీలపై రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో డీఎంహెచ్ఓ ఎం.దుర్గారావు దొర బుధవారం సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి చిన్నారుల ఆరోగ్యం గురించి తెలుసుకోవాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకబడిన వైద్యాధికారులకు పలు సూచనలు తెలిపారు.

క్షేత్ర స్థాయి వైద్యసేవలు మెరుగుపరచాలి

కపిలేశ్వరపురం: వైద్య ఆరోగ్య శాఖ ద్వారా క్షేత్రస్థాయిలో సేవలు మెరుగుపరచాలని డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావు దొర సిబ్బందిని ఆదేశించారు.వాకతిప్ప పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను వైద్యాధికారి పి.చంద్రమౌళి, వైద్యుడు సీహెచ్ రాకేష్ కృష్ణ చౌదరి వివరించారు. ఉద్యోగుల హాజరు, రోగులకు అందిస్తున్న సేవలు, రికార్డులను పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నిర్వహణ, లెప్రసీ సర్వేలపై పలు సూచనలు చేశారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆసుపత్రిలో ప్రసవాలను జరుపుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీహెచ్ఎస్ వీఎస్ కామేశ్వరరావు ఉన్నారు.

బాధితుడికి న్యాయం చేయాలని ధర్నా

కె. గంగవరం: కోటిపల్లిలో ఇసుక లారీ వల్ల ఆసుపత్రి పాలైన బాధితుడికి న్యాయం చేయాలని కోరుతూ వారి బంధువులు, సహచరులు బుధవారం రాత్రి ధర్నా నిర్వహించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోటిపల్లి గ్రామానికి చెందిన నాతి రావిని ఉదయం ఇసుక రాలీ ఢీకొట్టడం వల్ల గాయాలపాలై కాకినాడలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో రవి చికిత్సకు లారీకి సంబంధించిన యజమానులు బాధ్యత వహించాలని కోటిపల్లి- కె.గంగవరం రహదారిపై ధర్న నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులు, సహచరులతో చర్చలు జరిపారి. ఎంత సేపటికి చర్చలు సఫలం కాకపోవడంతో రామచంద్రపురం సీఐ, డీఎస్పీలకు స్థానిక పోలీసులు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో చర్చలు జరుపుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యంతో అధికారులు

కపిలేశ్వరపురం: అంగర ప్రధాన రహదారిపై బొలేరో వాహనంలో కోటిపల్లి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అంగరలో బుధవారం రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వారి కథనం మండపేట నుంచి అంగర మీదుగా పామర్రు వైపు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందింది. మాటు వేసి పట్టుకుని మహీంద్ర బొలెరో వాహనంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ విజయవాడ ముద్ర వేసి ఉన్న 63 బస్తాల సుమారు 3.150 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. తాపేశ్వరానికి చెందిన నాగిరెడ్డి చెప్పినట్టుగా యానాం పరిసర ప్రాంతానికి బియ్యాన్ని తీసుకెళ్తున్నానంటూ వాహన డ్రైవరు మచ్చ రాముడు తెలిపినట్టు అధికారులు తెలిపారు. బియ్యానికి బిల్లులు లేకపోవడంతో మండపేట సివిల్ సప్లయ్స్ అధికారులు వాహనాన్ని, బియ్యాన్ని సీజ్ చేసి, 6-ఏ కేసు నమోదు చేశారు. బియ్యం అక్రమ రవాణాలో భాగస్వాములైన నాగిరెడ్డి, వాహన యజమాని కేశన శ్రీనివాస్, డ్రైవరు మచ్చ రాముడు, రేషన్ బియ్యం అమ్మిన సత్యనారాయణ, వీరబాబు, రాంబాబు, కూలీలపై క్రిమినల్ కేసు నమోదుకు అంగర పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలు నాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య ప్రభుత్వం ధ్యేయం

కపిలేశ్వరపురం: సర్కారీ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ బీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. జగనన్న విద్యాకానుక, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై అభ్యసన తీరును ఆరా తీశారు. హెచ్ఎం రామలక్ష్మి ఉన్నారు.

త్వరగా బయోమెట్రిక్ పూర్తి చేయాలి

ఇటీవల పంపిణీ చేసిన జగనన్న విద్యా కానుకల బయోమెట్రిక్ ప్రక్రియను త్వరితిన పూర్తి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ బీవీ సుబ్రహ్మణ్యం మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. కపిలేశ్వరపురంలోని ఎమ్మార్సీ భవనంలో విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులతో సమీక్ష జరిపారు. విద్యాసంవత్సరం ప్రణాళిక, లక్ష్యాలు నిర్దేశికం, అమలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ కె.తాతారావు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.